సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 27 । మే । 2023



బొడ్డేపల్లి ఓ ధ్రువతార

బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. - 10లో



మెడిసిన్.. దొరుకునే!

పశువైద్య శాలల్లో అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాక్సిన్లు కూడా వేస్తున్నారు. - 10లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు


మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	35°	26°
ఇచ్ఛాపురం	35°	24°
పాతపట్నం	34°	26°
శ్రీకాకుళం	34°	26°

న్యూస్‌రీల్

ప్రాసెస్ ఫీజు చెల్లింపు ప్రక్రియ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పాలిసెట్–2023 ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా ప్రాసెస్ ఫీజు చెల్లింపు ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. ఫీజు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:ఏపీపాలిసెట్.ఎన్ఐసీ.ఇన్‌లో ఫీజు చెల్లించాలి. ఈ నెల 29వ తేదీ నుంచి శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సహాయ కేంద్రంలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. నోటిఫికేషన్ మేరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందని, జూన్ 15 నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభమవుతుందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రవేశాల సమన్వయ కర్త జి.దామోదర్ రావు తెలిపారు.

'కథా నిలయం చిరస్థాయిగా ఉంటుంది'



ప్రముఖ రచయిత కె.శివారెడ్డి

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని కథా నిలయం చిరస్థాయిగా నిలబడి ఉంటుందని ప్రముఖ రచయిత కె.శివారెడ్డి అన్నారు. స్థానికంగా ఒక కార్యక్రమానికి పాల్గొనేందుకు వచ్చిన ఆయన శుక్రవారం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. కథలు, కవిత్వం రాసేవాళ్లు ప్రస్తుత సమాజంలోని సమస్యలను, దేశభక్తి, సంఘటనలను కథావస్తువులుగా తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కథా రచయితలకు సరైన ప్రాధాన్యత కల్పించడం లేదన్నారు. మహిళలు కూడా ఎంతో మంది సాహిత్య రంగంలో ఎన్నో మంచి రచనలు చేశారని, చేస్తున్నారని అన్నారు. తెలుగు భాష తప్పని సరిగా ఉండాలని, తెలుగులో చదివిన వారు ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారు ఉన్నారని అన్నారు. సమాజ హితమైన సాహిత్యం రావాలని కోరారు.

28న పీఆర్ ఇంజినీర్ల సర్వసభ్య సమావేశం

అరసవల్లి: ఏపీ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజినీర్ల జిల్లా సంఘ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 28వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లుగా ఆ సంఘ అధ్యక్షుడు కేసీహెచ్ మహంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో పీఆర్ ఇంజినీర్లకు చెందిన పలు కీలక అంశాలను చర్చించనున్నామని, జిల్లాలో సభ్యులైన డీఈఈలు, ఏఈలు, టెక్నికల్, అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, తదితర సిబ్బంది అంతా హాజరుకావాలని మహంతి కోరారు.

శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు జాతీయ అక్రిడేషన్ కమిటీ గుర్తింపు

ఎచ్చెర్ల క్యాంపస్: మెరుగైన విద్యా ప్రమాణాలు, మౌలిక వసతుల ఆధారంగా శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు జాతీయ అక్రిడేషన్ కమిటీ గుర్తింపు మంజూరు చేసింది. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ నెలలో కమిటీ భౌతికంగా కాలేజీని సందర్శించిందని, ఆ సందర్శనలో క్లాస్‌వర్క్, అర్హత గల బోధకులు, మౌలిక వసతులు, ల్యాబ్‌లు, విద్యార్థులకు లభిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటివి పరిశీలించిందని, సంతృప్తి చెంది గుర్తింపు మంజూరు చేసిందని తెలిపారు. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలకు మూడేళ్లు ఈ గుర్తింపు మంజూరు చేశారని పేర్కొన్నారు.

ఇండక్షన్ ట్రైనింగ్‌తో గుణాత్మక విద్య



టీచర్లకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

కాశీబుగ్గ: గుణాత్మక విద్యను విద్యార్థులకు అందించేందుకు ఇండక్షన్ ట్రైనింగ్ ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. కాశీబుగ్గలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలని సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో అభ్యసన ఫలప్రదమవుతుందని అన్నారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పగడాలమ్మ మాట్లాడుతూ విద్యార్థులను నైతిక విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ముగింపు సమావేశంలో కోర్స్ డైరెక్టర్ వై.చిన్నమనాయుడు, మండల విద్యాశాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, కోర్స్ కో ఆర్డినేటర్ ఎస్ సూర్యప్రకాష్, బలివాడ సతీష్ రాష్ట్ర రిసోర్స్ పర్సన్లు లఖినాన వెంకటాచలం, ఆర్‌వి రమణమూర్తి, శ్రీనివాసరావు, పి.షణ్ముఖరావు, కిల్లి ఈశ్వరరావు పట్నాయక్, ముఖలింగం జి.వాణికుమారి పాల్గొన్నారు. ఈ ముగింపు సమావేశంలో చివరగా శిక్షణార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

● ఒక ఆక్రమణపై వేటు..

మరో అక్రమంపై లేటు!

- పాత్రునివలస భూకబ్జా చర్యలపై అనుమానాలు
- ఒక ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి, మరో ప్రాంతాన్ని పట్టించుకోని అధికారులు
- రూ.కోట్ల విలువైన ఆక్రమిత భూమిలో రాత్రికి రాత్రి నీలగిరి మొక్కలు నాటిన ఆక్రమణదారులు
- మానవ హక్కుల సంఘం, లోకాయుక్తకు ఫిర్యాదు చేసే యోచనలో స్థానికులు
- హైకోర్టులో పిటిషన్ వేసి భూకబ్జా గుట్టు రట్టు చేసేందుకు యత్నాలు



క్రయవిక్రయాలు జరగడంతో పట్టాలు రద్దు చేసిన ల్యాండ్ సీలింగ్ భూమి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : శ్రీకాకుళం సమీపంలోని పాత్రునివలస ఆక్రమణలపై అధికారులు వ్యవహరిస్తున్న వైఖరి అనుమానాలకు తావిస్తోంది. ఒక ప్రాంతంలో ఆక్రమణలను సమూలంగా తొలగించిన అధికారులు, అక్కడే మరో ప్రాంతంలో చేసిన కబ్జాను మాత్రం చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. ఇదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

మొదట ఇలా..

పాత్రునివలస రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 161/3లో ల్యాండ్ సీలింగ్ భూమి ఎకరా 18 సెంట్లు ఉంది. ఇందులో 161/3పీ కింద 63 సెంట్ల భూమిని మంగి రాజప్పడు, 15 సెంట్ల భూమిని దుగాన అశిరయ్య, 14 సెంట్ల భూమిని దుగాన వీరయ్య అనే వ్యక్తులకు 1977లో పట్టాలిచ్చారు. అయితే, ఇందులో మంగి రాజప్పడు, దుగాన వీరయ్య అనే వ్యక్తులు తమకిచ్చిన భూమిని వేరొకరికి విక్రయించారు. ల్యాండ్ సీలింగ్ భూమిని ప్రభుత్వమిస్తే అనుభవించాలే తప్ప వేరొకరికి విక్రయించకూడదు. అసైన్డ్ దారులైన మంగి రాజప్పడు, దుగాన వీరయ్య తమ భూములను వేరొకరికి విక్రయించారు. ఆ కొనుగోలుదారుల్లో ఒకరు మరొకరికి విక్రయించగా, ఇంకొకరి భూమిని బలగ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించారు. ఇవన్నీ గుర్తించిన అప్పటి తహసీల్దార్ వి.విశ్వేశ్వరరావు ల్యాండ్ సీలింగ్ భూమిని విక్రయించకూడదని, అసైన్డ్‌దారులే అనుభవించాలని పేర్కొంటూ 2006లో పట్టాలు రద్దు చేశారు. మరో అసైన్డ్‌దారుడైన దుగాన అసిరయ్య తనకు సంబంధించిన భూమి పంట పండించడానికి అనువుగా లేదని, తిరిగి ప్రభుత్వమే తీసుకోవాలని 2007 నవంబర్ రెండో తేదీన నేరుగా రాసిచ్చేశారు. దీనికి సంబంధించి పంచాయతీదార్ల సమక్షంలో పంచనామా కూడా జరిగింది. ఈ భూములను, పక్కనే ఉన్న మరో 26 సెంట్ల ప్రభుత్వ భూమిని తర్వాత కాలంలో కొందరు ఆక్రమించారు. అందులోనే అనుమతి లేకుండా రహదారులతో లేఅవుట్ వేసి, అనధికారికంగా ఓ భవనాన్ని నిర్మించి లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

తర్వాత అలా..

పాత్రునివలసలోని సర్వే నంబర్ 161/3లోని ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా చొచ్చుకురావడమే కాకుండా లేఅవుట్ కోసం అక్రమంగా వేసిన రోడ్డుపై ఫిర్యాదు రావడంతో 2021 సెప్టెంబర్‌లో ప్రస్తుత తహసీల్దార్ వెంకటరావు ఆదేశాల మేరకు అక్కడ కర్రలు కట్టి హెచ్చరిక బ్యానర్ కూడా ఏర్పాటు చేశారు. అప్పట్లో సర్వేయర్ రఘు, వీఆర్‌ఓ రాము, విలేజ్ సర్వేయర్ నవయ్య, సచివాలయం సిబ్బంది వెళ్లి ఈ హెచ్చరిక బ్యానర్ పెట్టారు. కానీ ఆక్రమణ దారులు బ్యానర్‌ను తొలగించి ప్లాట్లు వేసి అమ్మేశారు. కానీ రెవెన్యూ అధికారులు ఈ సారి ఏమీ అనకుండా ఉండిపోయారు.



శ్రీకాకుళం మండలం, పాత్రునివలస

రెవెన్యూ గ్రామము సర్వే నెంబర్ 161/3P విస్తీర్ణం

01.18 సెంట్లు ల్యాండ్ సీలింగ్ భూమి (ప్రభుత్వ భూమి)

కావున ఆక్రమణదారులు శిక్షార్హులు

ఇట్లు: తహశీల్దార్ శ్రీకాకుళం

2021 సెప్టెంబర్‌లో సర్వే నంబర్ 161/3లో గల ఎకరా 19సెంట్లు ల్యాండ్ సీలింగ్ భూమి అని, దానిని ఆక్రమిస్తే శిక్షార్హులని ఏర్పాటు చేసిన బ్యానర్

కొనుగోలుదారులకు టోకరా..

రూ. కోట్ల విలువైన భూమిని కబ్జాదారులు నేరుగా ఆక్రమించుకుని, ప్లాట్ల విక్రయాలు చేపడుతుండటం, అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో వాటిని కొనుగోలు చేసిన ప్రజలు మోసపోతున్నారు. వాస్తవంగా ఒకసారి పట్టాలు రద్దయితే మళ్లీ పునరుద్ధరించే అధికారం ఏ ఒక్క అధికారికి లేదు. కానీ, పాత పట్టాలను చూపించి కొందరు ఆక్రమణదారులు కొనుగోలుదారులను మభ్యపెట్టి లావాదేవీలు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ అధికారులు సైతం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. 2021లో ఇక్కడ ఆక్రమణలను గుర్తించి ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును కూడా కూడా కబ్జాదారులు తొలగించారు.

రాత్రికి రాత్రి వెలిసిన నీలగిరి మొక్కలు

అధికారులు చర్యలు తీసుకోవడంలో జరిగిన తాత్సారంతో కబ్జాదారులు కొత్త వ్యూహం పన్నారు. 'సాక్షి'లో కథనం వచ్చాక రాత్రికి రాత్రి ఆక్రమణదారులు ఆక్రమిత ప్రభుత్వ భూమిలో నీలగిరి మొక్కలు నాటేశారు. ఈ భూమిలో తాము ప్లాట్ల విక్రయాలు జరపలేదని, తాము నీలగిరి మొక్కలు పెంచుతున్నట్టుగా బిల్డప్ ఇచ్చారు. ఒకసారి నిర్మాణం చేపడితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించరలేని, కోర్టుకెళ్లి సాగదీయొచ్చన్న ఆలోచనలో కబ్జాదారులు ఉన్నట్టు సమాచారం. ఈ వైఖరిపై స్థానికులు న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధమవుతున్నారు. మానవ హక్కుల సంఘం, లోకాయుక్త, హైకోర్టుకు కూడా వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.



రాత్రికి రాత్రి ఆక్రమిత భూమిలో నీలగిరి మొక్కలు నాటిన ఆక్రమణదారులు

పక్షపాతం ఎందుకు..?

పాత్రునివలసలో రెండు సర్వే నంబర్లలో గల భూముల్లో ఆక్రమణలు జరిగాయి. వీటిపై 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దానికి స్పందించిన అధికారులు సర్వే నంబర్ 171/1లో గల 1.29సెంట్లు గల ప్రభుత్వ గోర్జి ఆక్రమణను గుర్తించి, అందులో ఉన్న లేఅవుట్ రాళ్లు, రహదారులను ధ్వంసం చేశారు. కానీ అదే ప్రాంతంలో సర్వే నంబర్ 161/3లో ఎకరా 18 సెంట్లు భూమిని ఆక్రమించిన బాగోతంపై మాత్రం మౌనం వహించారు. ఇదే అధికారులు గతంలో ఇక్కడ బ్యానర్ కూడా ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు మాత్రం చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. వారి దగ్గర పట్టాలను చూసి నిర్ణయం తీసుకుంటామని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. తెర వెనుక ఎవరి ఒత్తిడో పనిచేస్తోందని బలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఇదే విషయమై తహసీల్దార్ వెంకటరావును 'సాక్షి' వివరణ కోరగా ఒకదానిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, రెండో దానిపైన పట్టాలన్నీ సరిచూసుకుని, రికార్డులను పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

'విద్యుత్ సరఫరాపై తప్పుడు ప్రచారం'

టెక్కలి: వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని, దీనిపై కొన్ని పత్రికలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ చీఫ్ జనరల్ మేనేజర్ వి.విజయలలిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల టెక్కలి, పాతపట్నం ప్రాంతాల్లో ఈదురుగాలుల వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేవలం 12 నిమిషాలు మాత్రమే సరఫరా నిలిపివేశామన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి కోతలు లేకుండా నిరంతరం సరఫరా చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు సిక్కోలు యువకులు



మోహన్‌సాయి అప్పన్న భానుప్రసాద్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక జాతీయ సబ్ జూనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో తుర్ల మోహన్‌సాయి, కారి అప్పన, ముడిదాన భానుప్రసాద్ ఉన్నారు. వీరంతా శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద డీఎస్‌ఏ శాప్ వాలీబాల్ కోచ్ కె.హరికృష్ణ వద్ద శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 15 నుంచి రాజమండ్రిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ శిక్షణ శిబిరాల్లో మెరుగ్గా రాణించి సెలెక్టర్లను ఆకట్టుకోవడం ద్వారా జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈ నెల 28 నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా వేదికగా జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన మోహన్‌సాయి, అప్పన్న, భానుప్రసాద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలుర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి, పీడీ యాళ్ల పోలినాయుడు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణ, వాలీబాల్ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామచంద్రుడు, ఎన్వీ రమణ, నేషనల్ రిఫరీ సతీష్, చీఫ్ కోచ్ కె.శ్రీధర్‌రావు, శాప్ వాలీబాల్ కోచ్ కె.హరికృష్ణ తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

వేలిముద్రల ఇక్కట్లకు చెక్

- రేషన్ పంపిణీ విధానంలో మార్పులు
- వేలి ముద్ర పడకపోతే ఐరిష్ ద్వారా రేషన్ పంపిణీ
- జిల్లాకు 422 ఐరిష్ పరికరాల పంపిణీ



ఎండీయూ వాహనాల సిబ్బందికి ఐరిష్ పరికరాలు అందిస్తున్న నరసన్నపేట తహసీల్దార్ సింహాచలం

నరసన్నపేట: తెల్లరేషన్ కార్డు దారులకు రేషన్ పంపిణీలో ప్రభుత్వం సరికొత్త విధానాలకు తెర తీస్తోంది. ఇంటి వద్దకే తెచ్చి రేషన్ అందిస్తున్న ప్రభుత్వం .. వేలిముద్రలు పడక ఇబ్బంది పడుతున్న వారి ఇక్కట్లకు చెక్‌పెట్టనుంది. వీరికి ఐరిష్ ద్వారా రేషన్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు జూన్ నెల నుంచి కొత్త విధానం అమలు చేయడానికి ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే జిల్లాలోని 422 వాహనాలకు ఐరిష్ పరికరాలను అందజేసింది.

రేషన్ పంపిణీలో అక్కడక్కడా వేలి ముద్రల సమస్య తరచూ ఉత్పన్నమవుతోంది. ముఖ్యంగా వృద్ధులు ఉన్న చోట ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఆధార్ కార్డు అప్‌డేషన్‌కు వెళ్లేటప్పుడు కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. ఫలితంగా వీరికి రేషన్ అందించడానికి వీలు కావడం లేదు. ఇలా జిల్లావ్యాప్తంగా దాదాపు మూడువేల మంది బాధపడుతున్నారు. ఇలాంటి వారికి ఇకపై సమస్యలు ఉండవు. ఐరిష్ ద్వారా రేషన్ సరుకులు ఇవ్వడానికి ప్రభుత్వం సన్నద్ధమైంది.

జూన్ నుంచే..

జిల్లాలో 422 మొబైల్ వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా 6,61,824 కార్డుదారులకు నెలవారీ సరుకులు అందిస్తున్నారు. జూన్ నుంచి ఐరిష్(కంటి గుర్తింపు) విధానం అమలు చేయనున్నారు. దీనిపై విజన్ టెక్ ప్రతినిధులు ఎండీయూ వాహనాల సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. వేలి ముద్ర సమస్య ఉన్న వారికి ఐరిష్ ద్వారా రేషన్ ఇస్తారు.

ఖేలో ఇండియా బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా సూరిబాబు



ఎస్.సూరిబాబు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఖేలో ఇండియా బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సంపతిరావు సూరిబాబు అంపైర్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఏపీబీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంకమ్మ చౌదరి నియామక ఉత్తర్వులు వెలువరించారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో వేదికగా ఈనెల 29 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఆలిండియా ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. సూరిబాబు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీఈఓగా పనిచేస్తున్నారు. ఖేలో ఇండియా పోటీలకు నియామకం కావడంపై జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, చైర్మన్ ఆర్.రాజేంద్రన్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, బి.దామోదర్, జి.ప్రసాద్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఆయిల్‌పామ్ రైతులకు 'ఉపాధి' సాయం



మాట్లాడుతున్న ఆర్‌వీవీ ప్రసాదరావు

గార: ఈ ఏడాది ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఉపాధి హామీ పథకం కింద అదనంగా ఆర్థిక సాయం అందివ్వనున్నట్టు జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్‌వీవీ ప్రసాదరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాల వీఏఏలకు అవగాహన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఆయిల్ పామ్ రైతులకు నాలుగేళ్లకు ఎకరాకి రూ. 27,800 అందిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది అదనంగా ఉపాధి హామీ పథకం అనుసంధానం చేశామన్నారు. జాబ్ కార్డు కలిగిన రైతుకు ఒక ఎకరాకు మూడేళ్లలో రూ.47,648లు అదనపు ప్రోత్సాహకాన్ని అందజేసినట్టు చెప్పారు. ఈ ఏడాది ఆయిల్‌పామ్ మొక్కలను కంపెనీలు ఉచితంగా ఇవ్వాలని కోరామన్నారు. 2022–23 సంవత్సరంలో గార మండలలో అత్యధిక దిగుబడి సాధించిన కె.రామరాజును ప్రత్యేకంగా అభినందించారు. ఏడీఏ బగ్గు రజిని రామరాజును సత్కరించారు. ఒక ఎకరాకు లక్ష వరకు ఆదాయాన్ని పొందానని తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీ పి.ప్రసాద్, వ్యవసాయాధికారి దుంపల పద్మావతి, పతంజలి ఫుడ్స్ మేనేజర్ కె.రాజమోహన్, బి. శ్రీనివాసరావు, వి.రమణయ్య, ఏపీఓ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



వెంకటమ్మ (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలం బాతుపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు రాజాం వెంకటమ్మ (105) శుక్రవారం మృతి చెందారు. వెంకటమ్మకు భర్త కామన్న, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో భర్తతో పాటు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఇప్పటికే మృతి చెందారు. వెంకటమ్మకు ముదు మనవడు రాజాం చందు అంత్యక్రియలు చేశారు.

పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



తీవ్రగాయాలపాలైన లక్ష్మణరావు

టెక్కలి రూరల్: స్థానిక చిన్నబజారు జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గంగాధరపేట గ్రామానికి చెందిన బమ్మిడి లక్ష్మణరావు అనే వ్యక్తికి తన పెదనాన్న కుమారులతో ఆస్తి తగాదాలు ఉన్నాయి. దీనిపై వారు కోర్టుకు కూడా వెళ్లారు. ఈ వివాదంలో భాగంగానే శుక్రవారం చిన్నబజార్ జంక్షన్ సమీపంలోని తన పెద్దనాన్న కుమారుడి ఇంటి ఎదురుగా నిలబడిన లక్ష్మణరావు తనతో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. తీవ్రగాయాలపాలైన ఆయనను స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఘటనపై టెక్కలి ఎస్ఐ రామకృష్ణ వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

● రంగుల హంగులు



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నిర్మితమవుతున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆస్పత్రిలోని రెండు బ్లాక్‌లకు కొత్త రంగులు వేశారు. – కాశీబుగ్గ

నాలుగు రోజులుగా ఉరికి వేలాడుతూ..


- వివాహిత ఆత్మహత్య
- నాలుగు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన వైనం
- నరసన్నపేట శ్రీరామనగర్‌లో సంఘటన
- మృతురాలిది శ్రీకాకుళంలోని ప్రశాంతినగర్



మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి

నరసన్నపేట: నాలుగు రోజులుగా ఆ ఇంటి తలుపులు మూసే ఉన్నాయి. న్యూస్ పేపర్లు ఎక్కడ వేసినవి అక్కడే ఉన్నాయి. ఎవరు పిలిచినా లోపల నుంచి సమాధానం రావడం లేదు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఇంటికి వెళ్లి పరిశీలించిన పోలీసులకు ఫ్యాన్ హుక్‌కు ఓ మహిళ మృతదేహం వేలాడుతూ కనిపించింది. నాలుగు రోజులుగా ఆ మృతదేహం అలాగే ఉన్నట్లు వారు గుర్తించారు. నరసన్నపేట శ్రీరామనగర్‌లో జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతురాలు బమ్మిడి శాంతకుమారి(39) అని, ఆమెది శ్రీకాకుళంలోని ప్రశాంతినగర్ అని పోలీసులు నిర్ధారించారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

స్థానిక శ్రీరామనగర్‌లో బమ్మిడి జయకుమార్, భార్య శాంతకుమారి నివాసం ఉంటున్నారు. నాలుగు రోజులుగా ఆ ఇంటికి ఎవరూ రాకపోవడం, ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వై.సింహాచలం శుక్రవారం ఉదయం ఇంటిని పరిశీలించారు. తలుపులకు లోపల నుంచి గడియ పెట్టి ఉండడంతో తీయడం సాధ్యం కాలేదు. దీంతో ఆ కుటుంబం వివరాలు సేకరించారు. స్థానిక వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బమ్మిడి జయకుమార్ తన భార్య శాంత కుమారితో అక్కడ నివశిస్తున్నట్లు తెలుసుకున్నారు. జయకుమార్ ఆచూకీ తెలుసుకొని ఆయనను ఇంటికి రప్పించారు. అలాగే శాంతకుమారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారు వచ్చిన తర్వాత గడియ విరగ్గొట్టి లోపలకు వెళ్లి చూస్తే వంట గదిలో ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని శాంతకుమారి కనిపించింది. సంఘటన జరిగి నాలు గు రోజులు కావడంతో మృతదేహం నుంచి దుర్వాసన అధికంగా వచ్చింది. ఆమె మృతదేహాన్ని చూసి న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. అప్పటికే సిద్ధంగా ఉన్న క్లూస్ టీమ్ సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. శాంత కుమారి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.



శాంతకుమారి (ఫైల్)

ఈ నెల 23వ తేదీ వేకువజామున ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. అంతకు ముందు రోజు భార్యతో గొడవపడిన జయకుమార్ తన స్వగ్రామం నందిగాం మండలం శ్రీపురం వెళ్లిపోయి అక్కడే ఉన్నారు. దీంతో ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. సంఘటన స్థలాన్ని టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, తహసీల్దార్ ఎ.సింహాచలంలు పరిశీలించారు. మృతురాలి తండ్రి చిగులపల్లి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట సీఐ డి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వేధింపులు తాళలేకే..'

'నా కుమార్తె శాంతకుమారి అల్లుడు, ఆయన కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడింది' అని తల్లిదండ్రులు చిగులపల్లి లక్ష్మణరావు, కనకరత్నం సోదరి ధనలక్ష్మిలు ఆరోపించారు. వివాహమైనప్పటి నుంచి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని తెలిపారు. అవి భరించలేకే తమ కుమార్తె చనిపోయిందని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 2018లో వివాహమైందని, సంతానం లేదని అన్నారు. భర్త జయకుమార్ మాట్లాడుతూ ఆమె తనను వేధించేదని, పలుమార్లు కొట్టిందని, ఆ బాధలకు భయపడి 22న సొంతూరు వెళ్లిపోయానని, ఆ తర్వాత ఈ అఘాయిత్యానికి పాల్పడిందని అన్నారు.

క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి ఊరేగింపు



శివశంకర్ కాలనీలో అమ్మవారి ఘటాలతో ఊరేగిస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా గ్రామ తీరువీధుల్లో అమ్మవారి పట్టాభి జంగిడి, ఘటాల ఊరేగింపు శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. తన కన్నవారి ఇంటి నుంచి జూబ్లీ రోడ్డు మీదుగా తెలుకులవీధి, ట్యాంక్ వీధి(రాజీవ్ నగర్), శివశంకర్ కాలనీ ఐదు వీధులు, రత్నాలపేట, బజారువీధి, కుమ్మరవీధుల్లో ఘటాలతో ఊరేగించారు. దారి పొడవునా మహిళలు చీరలు పరిచి అమ్మవారిని ఆహ్వానించారు. పట్టాభి జంగిడి పట్టుకున్న మహిళలకు ముగ్రాట నీటితో అభిషేకాలు చేశారు.

విజయదుర్గకు ఫలాలతో అలంకరణ



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని నానుబాల వీధిలో కొలువై ఉన్న విజయదుర్గ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, ఫణిశర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి క్షీరాభిషేకాలు అనంతరం ఫలాలతో ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు.

'సమయపాలన పాటించాల్సిందే'



విచారణ జరుపుతున్న డీసీహెచ్ఓ భాస్కరరావు

పొందూరు: ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని డీసీహెచ్ఓ భాస్కరరావు హెచ్చరించారు. రెండు రోజుల కిందట రాత్రి 8 గంటల సమయంలో సిబ్బంది ఆస్పత్రిలో లేక పోవడంతో పాముకాటు బాధితుడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించిన ఘటనపై ఆయన శుక్రవారం విచారణ జరిపారు. ఆ సమయంలో ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది, లేని సిబ్బంది వివరాలు సేకరించి, సంజాయిషీ పత్రాలను తీసుకున్నారు. ఆస్పత్రిలో ప్రసవాలు జరగక పోవడం, సిజేరియన్‌లు పెరగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

ఎరువుల షాపుపై 6ఎ కేసు నమోదు



పురుగు మందుల షాపులో తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారులు

నరసన్నపేట: స్థానిక వైఎస్సార్ కూడలిలోని సిరి ట్రేడర్స్ పురుగు మందుల షాపుపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనల మేరకు 6ఎ కేసు నమోదు చేశారు. షాపులో కాలం చెల్లిన పురుగు మందులు, అనధికారంగా జీవన ఎరువులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు వెళ్లడంతో శుక్రవారం జేడీఏ ఆదేశాల మేరకు నాణ్యత నియంత్రణ అధికారి ఎల్.మురళీధర్, నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీతలు తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా జీవన ఎరువులు నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించి షాపులో ఉన్న రూ. 2.28 లక్షల విలువ కలిగిన ఎరువులను సీజ్ చేశారు. పురుగు మందుల లైసెన్స్ ఉన్నప్పటికీ తగిన స్టాక్ రిజిస్టర్, ఇతర రికార్డులు లేనందున షాపులో ఉన్న రూ.31,191 విలువ కలిగిన పరుగుల మందులను సీజ్ చేసినట్లు వ్యవసాయాధికారి తెలిపారు. అలాగే నిబంధనల మేరకు 6 ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మరళీధర్ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా ఎరువులు, పురుగు మందులు అమ్మకూడదని అన్నారు.

బొడ్డేపల్లి ఓ ధ్రువతార

- బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి ఉత్సవాలు వాడవాడలా జరిగేలా చర్యలు
- స్పీకర్ తమ్మినేని సీతారాం
- ప్రత్యేక కార్యాచరణతో శతజయంత్యుత్సవాలు: మంత్రి సీదిరి
- బీఆర్ఆర్ విగ్రహానికి విరాళంగా రూ.లక్ష అందజేసిన ఎమ్మెల్యే కృష్ణదాస్
- ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున రూ.20 లక్షలు మంజూరు చేసిన కలెక్టర్



బొడ్డేపల్లి రాజగోపాలరావు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, బొడ్డేపల్లి కుటుంబసభ్యులు

అరసవల్లి: దివంగత పార్లమెంటేరియన్ బొడ్డేపల్లి రాజగోపాలరావు ఒక లెజెండ్ అని, ఆయనను ఒక్క వర్గానికి పరిమితం చేయకూడదని, ఆయన అందరివాడని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు (బీఆర్ఆర్) శతజయంతి ఉత్సవాల నిర్వహణపై శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా దివంగత బీఆర్ఆర్ చిత్రపటానికి ముఖ్యులంతా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్పీకర్ మాట్లాడారు. బొడ్డేపల్లిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. శత జయంత్యుత్సవాలను ప్రభుత్వ పరంగా నిర్వహించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి ఏకంగా ఆరు సార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన రికార్డు బొడ్డేపల్లి సొంతమని, శత్రువును కూడా క్షమించగలిగే వ్యక్తిత్వం ఆయనదని గుర్తు చేశారు. ఒక్క అవినీతి ఆరోపణ లేని రాజకీయ నాయకుడిగా బొడ్డేపల్లి చరిత్రలో నిలిచారన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే వంశధార ప్రాజెక్టుకు బొడ్డేపల్లి రాజగోపాలరావు (బీఆర్ఆర్) పేరును పెట్టగా, ఇప్పుడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీఆర్ఆర్ పేరిట ప్రభుత్వం తరఫున శత జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నారని ఇదో అద్భుతమన్నారు.

మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో (1952) ఇండిపెండెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీని ఢీ కొట్టి విజయం సాధించిన బీఆర్ఆర్ ఓ చరిత్ర సృష్టించారన్నారు. అప్పట్లోనే ఇరిగేషన్‌తో పాటు పరిశ్రమలు అవసరమని ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసి శ్రీకాకుళం జిల్లాకు ఒక బ్రాండ్‌గా మారారని చెప్పారు. వంశధార ప్రాజెక్టు త్వరలోనే పూర్తికానుందని, అక్కడ దివంగత వైఎస్సార్‌తో పాటు బీఆర్ఆర్ విగ్రహం కూడా పెట్టాలని తాను భావిస్తున్నానన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ ప్రభుత్వం బీఆర్ఆర్ శత జయంతిని ఘనంగా నిర్వహించాలని ఆదేశించిందని, ఇందుకోసం రూ.20 లక్షల నిధులను విడుదల చేస్తున్నామని ప్రకటించారు. రానున్న 40 రోజుల్లో ప్రత్యేక కమిటీల ద్వారా ఈ ఉత్సవాలను షెడ్యూల్ ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు అధికారులంతా కూడా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో ముఖ్య ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈనెల 30న కొత్త రోడ్డు జంక్షన్‌లో బొడ్డేపల్లి భారీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. జూన్ 7న బీఆర్ఆర్ పుట్టిన గ్రామం అక్కులపేటలో కూడా విగ్రహావిష్కరణ ఉంటుందని, అదే రోజు జిల్లాలో అన్ని సచివాలయాల్లోనూ బొడ్డేపల్లి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక నివాళులర్పించే కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 15,16 తేదీల్లో జిల్లాలో అన్ని జిల్లా పరిషత్, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో బొడ్డేపల్లి జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని, ఈ మేరకు జెడ్పీ సీఈఓ, జిల్లా విద్యాశాఖాధికారి సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇక ఉత్సవాల్లో ప్రధాన ఘట్టంగా జూన్ 21న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.

జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ జిల్లాలో బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలు, పరిపాలన గురించి విన్నానని, ఆసక్తిగా ఆయన కోసం తెలుసుకున్నానని తెలిపారు. ఈ తరానికి ఆయన గొప్పతనం తెలిసేలా చర్యలు చేపట్టాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ తమ కుటుంబంలో రాజకీయాల పరిచయం బీఆర్ఆర్ నాయకత్వంలోనే మొదలయ్యాయని గుర్తు చేసుకున్నారు. అలాంటి మహానుభావుని విగ్రహాన్ని నరసన్నపేటలో ఏర్పాటు చేసేందుకు తనవంతుగా రూ. లక్ష నగదును కార్పొరేషన్ చైర్మన్ తిలక్‌కు సభలోనే అందజేశారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ నాడు ఢిల్లీలో జిల్లా వాణిని వినిపించి, జిల్లాకు ఎన్నో శాశ్వత పథకాలను తెచ్చిన ఘనత బీఆర్ఆర్‌దేనని అన్నారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి మాట్లాడుతూ నిజమైన నాయకుడి జీవితమంటే ఏంటో బొడ్డేపల్లి జీవితం చదివితే తెలుస్తుందన్నారు. ఒక బ్రాహ్మణుడినైన తనను ఎమ్మెల్యే చేసిన ఘనత బొడ్డేపల్లి రాజగోపాలరావు దేనని మాజీ ఎమ్మెల్యేకేఎన్ భుక్త అన్నారు. కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మాట్లాడుతూ బీఆర్ఆర్ శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వ పరంగా నిర్వహిస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. బొడ్డేపల్లి చేసిన సేవకు ఆయన ఫొటోను ప్రతి ఇంటిలో పెట్టుకోవాలన్నారు. రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ కోమటి కులానికి చెందిన తన పెద్దనాన్న అంధవరపు తవిటయ్యను ఎమ్మెల్యే చేసిన ఘనత కూడా బీఆర్ఆర్‌కు దక్కుతుందన్నారు.

అనంతరం బొడ్డేపల్లి శతజయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు కోడళ్లు మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, బొడ్డేపల్లి యామిని, కళింగ కుల సంఘ ప్రతినిధులు హనుమంతు కృష్ణారావు, చింతాడ రామ్మోహనరావు, దానేటి రాధాశ్రీధర్, దుప్పల వెంకటరావు, పేడాడ రమణి, జనార్దనరావు, పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు, మార్పు పృథ్వీ, బెందాళం పద్మావతి, చౌదరి నారాయణమూర్తి, పైడి యోగేశ్వరరావు, డాక్టర్ పి.సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ ద్వారా చెరువుల అభివృద్ధి



శివరామ పాత్రుని కోనేరు పరిశీలిస్తున్న అధికారులు

సారవకోట: నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో 11 చెరువులను అమృత సరోవర్ పథకం కింద జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నామని ఏపీడీ ఎం.శైలజ తెలిపారు. ఆమె మండల కేంద్రంలో అమృత సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసిన శివరామ పాత్రుని కోనేరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 52 వేల మంది వేతనదారులు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారని, రోజుకు రూ.248 నుంచి రూ.250 వరకు వేతనం వస్తున్నట్లు తెలిపారు. 79 ఎకరాల్లో ఉద్యానవన పంటలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అలాగే 5.2 కిలోమీటర్ల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా 24 చెరువు గట్లపై మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సీతంపేట ఐటీడీఏ పీఓ సూచనల మేరకు సారవకోట మండలంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలిచ్చిన 1170 మంది రైతులకు చెందిన కొండ ప్రాంతాల్లో మొక్కలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమెతో పాటు ఈసీ వెంకటరమణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై విచారణ



నౌపడలో గ్రామసభ నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డ్వామా పీడీ చిట్టిరాజు

టెక్కలి: ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమ మస్టర్లు వేస్తున్నారని, వేతనదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ పలువురు వేతనదారులు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డ్వామా పీడీ చిట్టిరాజు ఎదుట ఫిర్యాదు చేశారు. సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ పరిధిలో నౌపడ, సీతానగరం, కూర్మనాథపురం, జగన్నాథపురం, పాలనాయుడుపేట తదితర గ్రామాల్లో ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడుతూ వేతనదారులకు అన్యాయం చేస్తున్నారంటూ ఇటీవల వేతనదారులంతా నిరసన చేయడంపై శుక్రవారం టెక్కలి సబ్ కలెక్టర్, డ్వామా పీడీ తదితరులు నౌపడలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్‌రెడ్డిపై ఫిర్యాదుల వర్షం కురిపించారు. వేతనదారులకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని, పని దినాలు ఎక్కువ చేసినట్లు చూపుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని, వేతనదారుల నుంచి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారంటూ పలువురు వేతనదారులు ఫిర్యాదు చేశారు. దీనిపై సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి స్పందిస్తూ నౌపడ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులపై పూర్తి స్థాయిలో నివేదికలు సిద్ధం చేయాలన్నారు. అంతే కాకుండా వేతనదారులకు న్యాయం జరిగే విధంగా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ ఉమాసుందరి, ఏపీఓ వాసునాయుడు, ఎంపీటీసీ సుధా, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి సీటు మహిళకు ఇవ్వాలని సీఎంకు నివేదించాను



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ తరఫున మహిళా అభ్యర్థి పోటీలో ఉండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నివేదించినట్లు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం టెక్కలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు సీఎం వైఎస్ జగన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో రానున్న ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ తరఫున మహిళా అభ్యర్థి పోటీలో ఉండాలని పలుమార్లు సీఎంకు విన్నవించినట్లు తెలిపారు. ఇక్కడ పోటీ చేసే అవకాశం దువ్వాడ వాణికి ఇవ్వాలని కోరానని, దీనిపై సీఎం వైఎస్ జగన్ కూడా సానుకూలంగా స్పందించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి అంతా కృషి చేయాలని కోరారు.

సీటు కోసం ఫీటు



కాశీబుగ్గ: కాశీబుగ్గ మీదుగా నడుస్తున్న రైళ్లు విపరీతమైన రద్దీగా ఉంటున్నాయి. ఎగువ, దిగువ రైళ్లలో జనరల్ బోగీలు కిక్కిరిసి కనిపిస్తున్నాయి. రద్దీలో ఇబ్బందులు పడకూడదని ఓ చిన్నారిని ఇలా రైలు కిటికీ వద్ద కూర్చోబెట్టారు. షాలీమార్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ దృశ్యం కనిపించింది.

పేదలకు పట్టాలిస్తే.. కడుపు మంట ఎందుకు?

- మంత్రి సీదిరి అప్పలరాజు ధ్వజం

అరసవల్లి: శాసన రాజధాని అమరావతిలో 50 వేల మందికి పైగా పేదలకు భూపట్టాలిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడే ఆ ప్రాంతాన్ని నిజమైన అమరావతిగా మార్చారని, పేదోళ్లకు పట్టాలు ఇస్తే పెత్తందార్లకు కడుపు మంట ఎందుకని రాష్ట్ర పాడిపశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. ఆయన శుక్రవారం శ్రీకాకుళంలోని జెడ్పీ సమావేశ మందిరం వద్ద విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో పేదోళ్లకు స్థలాలివ్వకుండా ప్రతిపక్షాలన్నీ కుతంత్రాలు పన్నాయని అన్నారు. వామపక్షాలు కూడా దీన్ని అడ్డుకోలేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో గృహనిర్మాణాల పట్టాలను ప్రారంభించిన 1983 నుంచి 2014 వరకు రాష్ట్రంలో మొత్తం 53 లక్షల మంది పేదలకు ఇళ్లు ఇస్తే, ఒక్క వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఈ ప్రభుత్వం ఏకంగా 33.50 లక్షల ఇళ్లను ఇచ్చి రికార్డు సృష్టించిందన్నారు. అమరావతిలో పంపిణీ చేసిన పట్టాలన్నీ టీడీపీ ప్రభుత్వం వస్తే రద్దు చేస్తామని ఏబీఎన్ టీవీలో చెబుతుండడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అమరావతిలో పేదల ఇళ్ల పట్టాల విషయంలో రెండేళ్ల 364 రోజుల పాటు ప్రతిపక్ష పార్టీలు, టీవీ చానెళ్ల విజయం సాధించేలా కనిపించాయని, ఈ మూడేళ్ల కాలంలో ఆఖరిరోజైన 365వ రోజున న్యాయస్థానాల తీర్పులతో సీఎం వైఎస్ జగన్ గెలిచారని మంత్రి వివరించారు. టీడీపీ మహానాడు కు బస్సులు ఇవ్వడం లేదంటూ అచ్చెన్నాయుడు ప్రకటనలు చేస్తున్నారని అద్దె చెల్లిస్తే ఆర్టీసీ బస్సులు ఇస్తుందని తెలిపారు.

జిల్లాకు మందకృష్ణ మాదిగ రాక రేపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ జిల్లాకు ఆదివారం రానున్నట్లు సమితి ప్రతినిధి దాసరి తిరుమలరావు మాదిగ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం నగరంలో జిల్లాపరిషత్‌కు సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలో మాదిగలంతా అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	61,360–00
బంగారం(22కే. 10గ్రా.)	56,250–00
వెండి (కిలో)	77,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 485.00
శ్రీకాకుళం	రూ. 485.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

మెడిసిన్.. దొరుకున్!



గొర్రెలు మేపుతున్న కాపరి

- ప్రభుత్వ పశు వైద్య శాలల్లో అందుబాటులో అన్ని మందులు
- ఏటా వానాకాలంలో నట్టల నివారణ మందులు
- అన్నీ ఉచితమే
- వినియోగించుకోవాలని వైద్యుల సూచన



అత్యవసర వ్యాధులకు ఇంజెక్షన్లు, ఇన్‌స్టెంట్ రిలీఫ్ మందులు

కాశీబుగ్గ: కృత్రిమ గర్భధారణ, నట్టల నివారణ, బ్రూసెల్లా, గాలికుంటు నివారణ.. పేరేదైనా మందు మాత్రం ఉచితమే. జిల్లాలో ఉన్న పశువైద్య శాలల్లో అన్ని రకాల మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. అత్యవసర సమయాలతో పాటు సాధారణ సమయాల్లో వాడే అన్ని రకాల మందులను రైతులకు అందుబాటులో ఉంచుతోంది. ఈ అవకాశాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పశువైద్యశాలలతో పాటు రైతు భరోసా కేంద్రాల్లోనూ చాలా రకాల సదుపాయాలు కల్పిస్తున్నారు. పశువులకు పశుగ్రాసం పెంచుకునే విత్తనాలు నుంచి అవసరమైన సబ్సిడీపై మందులు సైతం అందుబాటులో ఉంచుతున్నారు.

ఉచిత మందులు..

- గేదెలు, ఆవులు, ఎద్దులకు ఏడాదికి రెండు సార్లు గాలికుంటు నివారణ, గొంతు వాపు, జబ్బ వాపు నివారణకు మందులు ఉచితంగా అందిస్తారు.
- ఆవులు, గేదెలు దూడలు కావాలనుకునే వారికి ప్రత్యేకమైన మేలు జాతి విత్తనాలను కృత్రిమ గర్భధారణ ద్వారా అందించేందుకు అనేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.
- ఆరు నెలలు దాటిన ఆడ దూడలకు బ్రూసెల్లా వ్యాధి సోకకుండా ముందస్తుగా నివారణ మందులు అందిస్తున్నారు.
- మేకలు, గొర్రెలకు ముఖ్యంగా చికిటి వ్యాధి, అకస్మాత్తుగా పారుడు వ్యాధిరావడం,ఒళ్లంతా పొక్కులతో గోట్ పాక్స్, షీప్ పాక్స్ సోకకుండా వ్యాక్సిన్లు వేస్తారు.
- మేకలు, గొర్రెలకు పీపీఆర్ వ్యాక్సినేషన్ సైతం అవసరం అయినప్పుడు అందుబాటులో ఉంచి వ్యాధులు సోకుతున్నాయంటే తక్షణమే సేవలు అందిస్తారు.
- ఏటా వానాకాలంలో అన్ని జీవులకు నట్టల నివారణ మందులు వేసి కుంటువ్యాధి, కాలిలో పురుగులు, నడవలేని వ్యాధులకు గురికాకుండా చేస్తారు.
- ఏ-బ్లాక్ క్వార్టర్, హెఎస్, గాలికుంటు వ్యాధి, లంపీచర్మ వ్యాధి టీకా ఉన్న పెద్ద జంతువులకు రెగ్యులర్ టీకాలు వేస్తారు. గొర్రెలు, మేకలకు ఇటి, పీపీఆర్, నీలి నాలుక కోసం గొర్రెలు, మేక పోక్స్ నివారణ టీకాలు వేస్తారు. గొర్రెలు, మేకలకు సామూహిక నులిపురుగుల నిర్మూలన సంవత్సరానికి రెండుసార్లు నిర్వహిస్తాం.
- దీనికి తోడు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌తో ఉచిత అంబులెన్స్ సేవలు సైతం నిర్వహిస్తున్నారు.

ఈ తేదీల్లోనే..

- ఏప్రిల్ 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మొదటి రౌండ్ డీవార్మింగ్ మందులు అన్ని గొర్రెలు, మేకలకు వేస్తారు.
- మే 1 నుంచి 31వ తేదీ వరకు హెచ్ఎస్, బిక్యూ, ఈటి వ్యాక్సినేషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి గొర్రెలు, మేకలకు వేస్తారు.
- జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు బ్రూసెల్లా కంట్రోల్ మొదటి కార్యక్రమం నాలుగు, ఎనిమిది నెలలు నిండిన ఆడ దూడలకు వేస్తారు.
- జూలై 6వతేదిన యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇదే రోజున వైఎస్సార్ టీకా వారోత్సవాలు నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కుక్కలకు ఈ వ్యాక్సినేషన్ చేస్తారు.
- జూలై 1 నుంచి 31వ తేదీ వరకు బీటీ వ్యాక్సినేషన్ (నీలిరంగులో మారిన నాలుక వ్యాధికి) రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గొర్రెలు, మేకలకు మందులు వేస్తారు.
- సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ మొదటి రౌండ్ పందులు, ఆవులు, ఎద్దులకు అందిస్తారు.
- అక్టోబర్ 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు బ్రూసెల్లా కంట్రోల్ కార్యక్రమం-02 04, 08 నెలలు నిండి ఆడదూడలకు వేస్తారు.
- అక్టోబరు 21 నుంచి 30వ తేదీ వరకు హెచ్ఎస్ వ్యాక్సినేషన్ దున్నపోతులకు, ఆంబోతులకు వేస్తారు.
- నవంబర్ 1 నుంచి 10వ తేదిలలో రెండో డీవార్మింగ్ కార్యక్రమం మేకలకు, గొర్రెలకు నిర్వహిస్తారు.
- నంబర్ 15 నుంచి 30వ తేదీ వరకు షీప్ పాక్స్, గోట్ పాక్స్ వ్యాక్సినేషన్ చేస్తారు.
- డిసెంబరు 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పీపీఆర్ వ్యాక్సినేషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గొర్రెలు, మేకలకు చేస్తారు.
- జనవరి, ఫిబ్రవరి, మార్చినెలల్లో కోళ్లకు, కాఫ్ డీ వార్మింగ్, ఫౌల్ట్రీ వ్యాక్సినేషన్ చేస్తారు.



కుక్కలకు రాబిస్ వ్యాక్సినేషన్

క్యాలెండర్ విడుదల చేస్తాం



జిల్లాలో ఉన్న మూగజీవాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలైన వ్యాక్సినేషన్ సౌకర్యం కల్పిస్తోంది. ఆయా నెలల్లో జరిగే వ్యాక్సినేషన్ వివరాలు ప్రజలు తెలుసుకోవాలి. ఆ క్యాలెండర్ కూడా విడుదల చేశాం. అత్యవసరమైతే అంబులెన్సు సేవలు అందిస్తాం. సాధ్యం కాకుంటే అంబులెన్సులో తరలిస్తాము. వ్యాధి నిర్ధారణకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ల్యాబ్‌లు కూడా ఉన్నాయి. – పోతనపల్లి చంద్రశేఖరం, సహాయ సంచాలకుడు, పశుసంవర్ధక శాఖ, పలాస